ప్రజాశక్తి
సోమవారం 11 సెప్టెంబర్ 2023 5 శ్రీ సత్యసాయి





సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయులను బోధనకే వినియోగించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయులను బోధనే ఉపయోగించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలోనిఉపాధ్యాయ భవనంలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం అనంతపురం, శ్రీ సత్య సాయి, నంద్యాల ,కర్నూలు, అన్నమయ్య, కడప జిల్లాల ప్రధాన నాయకత్వ సమావేశం జరిగినది. ఈ సమావేశానికి యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరితోపాటు రాష్ట్ర ఆడిట్ కమిటీ మెంబర్ ఎం వి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్ దేవేంద్రమ్మ, ఎన్ శాంతి ప్రియ పాల్గొన్నారు. ఈసందర్భంగా నక్కావెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోధన కోసం నియామకం చేసిన ఉపాధ్యాయుల చేత ఎక్కువ సమయం బోధనేతర కార్యక్రమాలు వినియోగించుకుంటూ విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. సెల్ ఫోన్లను పాఠశాల బోధనా సమయంలో వాడటం నిషేధం చేశారని, అయితే అదే బోధనా సమయంలో ఎదో ఒక సమాచారం పంపమని చెప్పడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. పాఠశాల పనిదినాలలో ఏదో ఒక పేరుతో శిక్షణా కార్యక్రమాలు పెట్టడం ద్వారా విద్యార్థుల బోధనా సమయాన్ని హరిస్తున్నట్లు కాదా అని ప్రశ్నించారు. ఎక్కడ ఉపాధ్యాయుల తప్పులు దొరుకుతాయి అనే పద్ధతిలో అధికారులు పర్యవేక్షణ ఉండటం సరికాదని అన్నారు. అసలు పర్యవేక్షణ అంటే ఉపాధ్యాయులను శిక్షించడం అనేవిధంగా అర్థం మార్చివేశారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఉపాధ్యాయుల పూర్తి సమయాన్ని విద్యార్థుల భోదనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. యుటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయకుండా ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. ప్రాథమిక పాఠశాలల నిర్వీర్యం చేయడం ఆపి,బలోపేతానికి కావాల్సిన చర్యలు ,సూచనలు విద్యారంగ శ్రేయోభిలాషులనుండి ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. వివిధ పోరాటాల సందర్భంగా ఉపాధ్యాయులపై బనాయించిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగమయ్య, గోవిందరాజులు, శ్రీ సత్య జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ జయచంద్రారెడ్డి, ఎం సుధాకర్, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె. సుధాకర్, పివి. ప్రసాద్, కర్నూలు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె ఎల్లప్ప, ఎం జయరాజ్ అన్నమయ్య జిల్లా నుండి బి హరి ప్రసాద్ ,కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి మహేష్, ఎం విజయ్ కుమార్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హై అలర్ట్

చంద్రబాబు రిమాండ్‌తో టిడిపి శ్రేణుల్లో నిర్వేదం

ప్రధాన కూడళ్లలో పోలీసు పహారా

నేడు బంద్‌కు పిలుపు



కదిరిలో టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు



రాయదుర్గంలో నిరసన దీక్ష చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడును 14 రోజులు పాటు రిమాండ్‌కు న్యాయ స్థానం ఆదేశించడంతో టిడిపి శ్రేణుల్లో నిర్వేదం నెలకొంది. శనివారం ఆయన్ను అరెస్టు చేసి ఆదివారం ఉదయం కోర్టు ముందు హాజరుపరచినప్పటి నుంచే ఆ పార్టీ శ్రేణుల్లోనే కాకుండా సామాన్యుల్లోనూ ఉత్కంఠత నెలకొంది. జిల్లాలో ఎక్కడ ఇద్దరు కలిసినా చంద్రబాబు అరెస్టు విషయంపైనే చర్చ జరగడం గమనార్హం. ఉదయం నుంచి తీర్పు కోసం అందరూ ఆసక్తిగానూ, ఉత్కంఠతతోనూ ఎదురు చూశారు. సాయంత్రం ఆయనకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ తీర్పునివ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగానే హై అలర్టును ప్రభుత్వం ప్రకటించింది. జిల్లాలోనూ హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ప్రధాన పట్టణాలు, నగరాల్లో పోలీసులను అప్రమత్తం చేశారు. అన్ని ప్రధాన కూడళ్లలో పోలీసు పహారాను ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ విధించారు. సాయంత్రం తీర్పు వెలువడినప్పటి నుంచి జనాలు గుమికూడకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

కొనసాగిన నిరసనలు

చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ ఆదివారం నాడు అనంతపురం జిల్లాలో పలుచోట్ల నిరసనలు కొనసాగాయి. పలుచోట్ల మౌనదీక్షలను చేపట్టారు.సత్యసాయి జిల్లాలో రెండు చోట్ల టిడిపి అభిమానులు చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ సెల్ టవర్లు ఎక్కారు. లేపాక్షి, కదిరిల్లో సెల్‌టవర్ ఎక్కి నిరసన చేపట్టారు పోలీసులు నచ్చజెప్పి వారిని కిందకు దింపారు. అనంతపురం , రాయదుర్గం, కళ్యాణదుర్గం, కదిరి తదితర ప్రాంతాల్లో నిరసన దీక్ష చేపట్టారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాల వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. ప్రభుత్వం ఉద్దేశ్యపూర్వకంగానే ఇబ్బంది పెట్టేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు.

నేడు బంద్‌కు పిలుపు

చంద్రబాబునాయుడు రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. జిల్లాలోనూ నేడు బంద్ కొనసాగే అవకాశముంది.. సోమవారం నిరసనలు మరింత పెరిగే అవకాశాలున్నందున పోలీసులు అప్రమత్తమయ్యారు. ముఖ్యమైన నాయకుల ఇళ్ల వద్ద సైతం పోలీసు నిఘాను పెట్టారు. తెలుగుదేశం పార్టీకి జిల్లాలో మంచి పట్టుంది. దీంతో నిరసనలు పెద్ద స్థాయిలోనే జరిగే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఎక్కడా ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఓబులు

శ్రమదోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

ప్రజాశక్తి -పెనుకొండ

సత్యసాయి జిల్లాలో వేలాది మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారని ఈ శ్రమదోపిడికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామనిసిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సత్యసాయి డిగ్రీ కళాశాలలో జరిగిన సిఐటియు 2వ రోజు వర్క్ షాపులో పాల్గొన్న ఓబులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ చేసి అంబానీ,ఆదానీకి గులాం గిరి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనికి తలగ్గి ప్రైవేటీకరణకు పూనుకుంటోందని విమర్శించారు. సంఘటిత, అసంఘటిత కార్మిక వర్గానికి జగన్మోహన్ రెడ్డి తీవ్రమైన ద్రోహం చేస్తున్నారన్నారు. వేలాదిమంది శ్రామిక మహిళలు గార్మెంట్స్ లో , కియో పరిశ్రమ, అనుబంధ సంస్థలలో పనిచేస్తున్నారని వీరికి ప్రస్తుత, ప్రభుత్వాలు కనీస వేతనం సలహా బోర్డు ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో 15 సంవత్సరాలుగా వీరు శ్రమ దోపిడీకి గురవుతున్నారని విమర్శించారు.కార్మికులు కూలీలు గురించి మాట్లాడే జగన్మోహన్ రెడ్డి కనీస వేతన సలహా బోర్డు ఏర్పాటు చేసి కనీస వేతనాన్ని అమలు చేయాలని, 10 సంవత్సరాలు నష్టపోయిన పరిహారాన్ని కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాలలో కార్మికులకు రూ. 20వేల నుంచి 22వేల రూపాయల కనీస వేతనాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్పీ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జిల్లా కోశాధికారి సాంబ, జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్, బాబా, రమేష్, నరసింహులు, శ్రీదేవి, లక్ష్మీనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి బాబావలి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కదిరి సీటుపై మైనార్టీల చూపు

పెరుగుతున్న ఆశావహులు

గట్టినమ్మకంతో సీనియర్ నాయకుడు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న కొద్దీ కదిరి ఎమ్మెల్యే టికెట్‌పై వైసిపిలోని మైనార్టీల్లో పోటీ నెలకొంటోంది. ఈసారి మైనార్టీలకు టికెట్ కేటాయిస్తే తమకు అవకాశం ఇవ్వాలని ఆశావహులు తమదైన శైలిలో ప్రయత్నాలు చేస్తున్నారు. వైసిపి ఆవిర్భావం కంటే ముందు నుంచే జగన్మోహన్‌రెడ్డి వెంట నడిచిన వైసిపి మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్ ఎమ్మెల్యే టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో పనిచేసిన ఆయన వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం ప్రయత్నాలు చేశారన్న అభిప్రాయాలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. అయితే2014, 2019 ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి ఇస్మాయిల్ అని చివరి వరకు ప్రచారం జరిగింది, అయితే చివరి నిమిషంలో ఆయనకు బిఫారం దక్కలేదు. దీంతో ఆయన ఆసమయంలో తీవ్ర నిరాశకు గురయ్యారు. ప్రస్తుతం కదిరి నియోజకవర్గంలో మైనార్టీ నాయకుల్లో పార్టీ ప్రతిష్ట కోసం పనిచేసిన ప్రధాన వ్యక్తి ఇస్మాయిల్ అన్న అభిప్రాయాలు ఆపార్టీ వర్గాల్లోనే వెలువడుతున్నాయి. పార్టీ అధికారంలో ఉన్నా ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ ప్రతిష్ట కోసమే పని చేస్తూ కార్యకర్తలను కలుపుకుంటూ ముందుకు పోతున్న ఇస్మాయిల్‌కు జగన్ ఈసారైనా న్యాయం చేకూర్చుతారా అన్న చర్చలు జోరందుకున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్త కొత్త వ్యక్తులు పార్టీ పేర్లు చెప్పుకొని ఆర్థిక బలం ఉన్న వారమంటూ పార్టీ బడాబాబుల వద్దకు తిరుగుతున్న నాయకులు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వైసిపిలో కదిరి స్థానం మైనార్టీకు కేటాయిస్తే ఎవరిని టికెట్ వరిస్తుందోనన్న చర్చలు నియోజకవర్గంలో ఊపందుకున్నాయి.



హిందూపురంలో వైసిపి టికెట్ మైనార్టీలకు కాకుండా ఇతరుకు కేటాయిస్తున్నారన్న సంకేతాలు వస్తున్న నేపథ్యంలో కదిరి టికెట్‌పై మైనార్టీ ఆశావహుల్లో ఉత్సాహం నెలకొంది. ఈ మధ్యకాలంలో ఆర్థికంగా బలంగా ఉన్న నాయకులు తెరపైకి రావడంతో గతంలో నుంచి పని చేసిన నాయకులు కనుమరుగవుతారా అన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. అయితే ఇస్మాయిల్ ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కలిసినప్పుడు ఆయనకు మాట ఇచ్చినట్లు ఇస్మాయిల్ వర్గీయుల్లో నుంచి వార్తలు వినిపిస్తున్నాయి. మరోవైపు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నితిన్ రెడ్డిలు కూడా ఇస్మాయిల్ వైపే ముగ్గు చూపుతున్నట్లు ఎస్ఎండి వెంట ఉన్న కార్యకర్తలు బహిరంగ వ్యాఖ్యానాలు చేస్తున్నారు. పార్టీ అధికారంలో ఉన్న కాలంలో కూడా ఎలాంటి పదవులను ఆశించకుండా పార్టీ అభివృద్ధికి కోసం పనిచేసిన ఇస్మాయిల్‌కు ఈసారి ఖచ్చితంగా న్యాయం జరుగుతుందన్న ఆయన వర్గీయులు విశ్వసిస్తున్నారు.



వైసిపి మాజీ సమన్వయ కర్త ఇస్మాయిల్



వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో ఇస్మాయిల్ (ఫైల్)




వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ఇస్మాయిల్ (ఫైల్)

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా

సెల్‌టవర్ ఎక్కిన యువకులు

ప్రజాశక్తి - లేపాక్షి, కదిరి టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడి అరెస్టుకు నిరసనగా శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి, కదిరి మండలాల్లో టిడిపి అభిమానులు సెల్‌టవర్ ఎక్కారు. లేపాక్షి పరిధిలోని మైదుగోళం గ్రామానికి చెందిన యువకుడు ఆదివారం సెల్ టవర్ ఎక్కాడు. గ్రామానికి చెందిన రామిరెడ్డి కొడుకు మంజునాథ్ రెడ్డి గ్రామం లోని సెల్ టవర్ ఎక్కి చంద్రబాబుని వెంటనే విడుదల చేయాలని, లేకపోతే ఇక్కడ నుండి దూకి ఆత్మహత్య చేసుకొంటానని హెచ్చరించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం తో ఎస్ఐ మునీర్ అహమ్మద్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈసందర్భంగా మంజునాథ్ రెడ్డికి సర్ది చెప్పి టవర్ నుండి క్రిందికి దిగేలా చేశాడు. అనంతరం మంజునాథరెడ్డిని అతని కుటుంబ సభ్యులకు అప్పగించాడు. అదే విధంగా కదిరి పట్టణంలో సత్య సాయి జిల్లా తనకల్లు మండలానికి చెందిన శివయ్య అనే టిడిపి కార్యకర్త కదిరి పట్టణంలోని వలి సబ్ రోడ్డులో సెల్ టవర్ ఎక్కాడు. చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని లేని పక్షంలో ప్రాణ త్యాగానికైనా సిద్ధమని హెచ్చరించారు. దీంతో పోలీసులు శివయ్యకు నచ్చజెప్పి కిందికి దింపారు.



కదిరిలో సెల్‌టవర్ ఎక్కిన టిడిపి అభిమాని శివయ్య

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

మహిళల ఆర్థిక స్వాలంబనతో పేదరికం నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా గ్రామీణ శాఖ అభివృద్ధి సంస్థ, ఐకెపి ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య పేర్కొన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని 32 మండలాల్లో మహిళలను పేదరికం నుంచి బయట పడేయటానికి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ద్వారా అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల ద్వారా వారి జీవనోపాదులు కల్పించి అమలు చేయడం డిఆర్‌డిఎ, ఐకెపి పాత్ర కీలకమన్నారు. మహిళా సంఘాల మహిళలకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు ఇప్పించి తద్వారా చేతివృత్తులు చిరు వ్యాపారాలు ద్వారా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ఆ ప్రాజెక్టు పని చేస్తోందన్నారు. అంతేగాక ఈ సంస్థ ద్వారా మరిన్ని పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. మహిళలనే కాక రైతు సంఘాల ద్వారా మెరుగైన జీవన విధానం అవలంబించి అభివద్ధి పరచుటకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో డిఆర్‌డిఎ, ఐకెపి ద్వారా అమలు పరుస్తున్న పథకాల గురించి ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో ఆ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య వివరించారు.

ప్రశ్న : జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ ముఖ్య ఉద్దేశం ఏమిటి?లి

జవాబు : గ్రామీణ పేదలను సమీకరించి వారితో సంఘాలు ఏర్పాటు చేసి వారి జీవనోపాదులను మెరుగు పరచడం ద్వారా పేదరికం నిర్మూలన చేసేందుకు గాను పేదరిక నిర్మూలన సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తద్వారా మహిళలు ఆర్థిక స్వాలంబన కోసం కృషి చేస్తున్నాం.

ప్ర : జిల్లాలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి? ఇప్పటివరకు మంజూరు చేసిన నిధుల వివరాలు ?

జ : పేదరికం నిర్మూలనలో భాగంగా జిల్లాలో 32 మండలాల్లో 3.53 లక్షల మంది మహిళలు సంఘాలలో సభ్యులుగా ఉన్నారు. 33,686 సంఘాలకు గాను గ్రామస్థాయిలో 1531 గ్రామ సమాఖ్యలు ఉన్నాయి. 32 మండలాలలోని మహిళా సంఘాల సభ్యులకు శ్రీ సత్య సాయి జిల్లా సమాఖ్యగా మాక్స్ చట్టం 1995 ప్రకారం ఏర్పాటు చేశాం. పేద మహిళ కుటుంబాలు పేదరికం నుండి బయటపడటానికి సమగ్రమైన వ్యూహం తయారుచేసి అమలు చేస్తున్నాం. ఇందులో భాగంగా జీవనోపాదుల పెంపుదల, మానవ అభివృద్ధి మెరుగుపరుచుకొనుట, సామాజిక భద్రతను కల్పించుట ద్వారా, వివిధ మార్గాల ద్వారా పేద మహిళా కుటుంబాలకు నెలకు రూ. 10 వేలు



మించి ఆదాయాన్ని పెంచడమే ముఖ్య ఉద్దేశంగా ప్రాజెక్టు పని చేస్తోంది.

ప్ర : జిల్లావ్యాప్తంగా పెన్షన్లు ఎంతమందికి అందచేస్తున్నారు?

జ : క్రమం తప్పకుండా ప్రతి నెల ఒకటవ తేదీనే వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం పెన్షన్లు అందజేస్తోంది. రూ. 3వేలు పింఛను అందించాలన్న లక్ష్యంతో దశలవారీగా ప్రభుత్వం పెంచుతోంది. ప్రస్తుతం 2750 రూపాయలు అందిస్తున్నాం. వచ్చే ఏడాది మరో 250 రూపాయలను ప్రభుత్వం పెంచబోతోంది. కరోనా కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వం ఏటా రూ.19వేల కోట్లు వివిధ రకాల పింఛన్లకు వ్యయం చేస్తోంది. 2022-23 వరకు 2.64 లక్షల మందికి రూ. 876.43 కోట్లు మంజూరు చేసింది.

ప్ర : ప్రాజెక్టు పరిధిలో అమలు చేస్తున్న పథకాల వివరాలు తెలపండి ?

జ : వైఎస్ఆర్ ఆసరా క్రింద జిల్లా వ్యాప్తంగా మొదటి విడత 23,288 సంఘాలకు గాను రూ. 179.69 కోట్లు, రెండవ విడత 23,365 సంఘాలకు రూ. 181.47 కోట్లు, మూడవ విడతలో 23,340 సంఘాలకు రూ. 180.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే సున్నా వడ్డీ పథకం క్రింద మూడు విడతల్లో 84,919 సంఘాలకు రూ. 258.81 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. బ్యాంకు లింకేజీ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో 23,388 సంఘాలకు రూ. 1068.06 కోట్లు రుణాలు ఇప్పించాం. శ్రీనిధి ద్వారా ఇప్పటివరకు 20,072 సంఘాలకు రూ. 100.35 కోట్ల రుణాలు అందించడం జరిగింది. ఉన్నతి పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 1267 సంఘాలకు రూ. 6.47 కోట్ల రుణం అందించాం. వైయస్సార్ చేయూత పథకం ద్వారా మూడు విడతల్లో రూ. 582.70 కోట్లు ప్రభుత్వం జమ చేసింది. చేయూత మహిళ మార్టుల ప్రారంభంలో భాగంగా జిల్లాలో బత్తలపల్లి మండలంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో మహిళా మార్టు ప్రారంభించాం. ఇప్పటివరకు రూ. 54.99 లక్షలు అమ్మకాలు జరిపి రూ. 3 లక్షల ఆదాయంలో ఉంది. జిల్లాలో ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు నికర ఆదాయమే లక్ష్యంగా పనిచేస్తున్నాయి. ఈ 942 సంఘాలలో 9316 మంది సభ్యులు ఉన్నారు. 9 మండలాలలో ఈ సంఘాలు ఉన్నాయి. వీటి అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది.



డిఆర్‌డిఎ పీడీ నరసయ్య

ప్ర : ఈ సంఘాలకు మీరు ఇచ్చే సలహాలు, సూచనలు ఏమిటి?

జ : ప్రభుత్వం ఏ ఉద్దేశంతో ఈ సంఘాలు ఏర్పాటు చేసిందో ఆ ఉద్దేశం నెరవేరే విధంగా సంఘం సభ్యులు కృషి చేయాలి. పేదరికం నుంచి బయటపడి ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా ముందుకు సాగాలి. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి. బ్యాంకుల నుంచి తీసుకొన్న రుణాలను సకాలంలో చెల్లించితే బ్యాంకర్లు మరింత ఎక్కువ రుణాలు అందిస్తాయి.



పెనుకొండలో దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

తెలుగుతమ్ముళ్ల నిరసనాగ్రహం



హిందూపురంలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుపై అక్రమ కేసు బనాయించి వైసిపి సైకోలు శునకానందం పొందుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె పార్థసారథి పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆదివారం బికె పార్థసారథి ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. గతంలో చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టిన మీ తండ్రి వైఎస్ వల్లే ఏమీ కాలేదు ఇప్పుడు నీవల్ల ఏమవుతుందని జగన్‌పై విరుచుకుపడ్డారు. ధర్మానికి ఖచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికే 48 గంటల పోలీసుల కాల్ డేటా అడుగుతుంటే పోలీసులు తర్జనభర్జన పడుతున్నారన్నారు. సిఎం జగన్ గతంలో 16 నెలలు జైలులో గడిపాడని, ఆ దురుద్దేశంతోనే చంద్రబాబును ఎలాగైనా జైలుకు పంపాలని చూస్తున్నాడని ధ్వజమెత్తారు. ఎంతమంది ఐఎఎస్, ఐపిఎస్, లాయర్లను నీ పక్షాన పెట్టుకున్నా న్యాయం చంద్రబాబు పక్షాన ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

జగన్‌కు రాష్ట్రాభివృద్ధి కంటే ప్రతీకారమే ముఖ్యం : సవితమ్మ

సిఎం జగన్‌కు రాష్ట్రాభివృద్ధి కంటే ప్రతీకారమే ముఖ్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన వ్యక్తిగత కార్యాలయం వద్ద చేపట్టిన సామూహిక నిరసన దీక్షలో ఆమె మాట్లాడారు. దేశంలో ఎవరిని అడిగినా చంద్రబాబు దార్శనికత గురించి చెబుతారన్నారు. 16 నెలలు జైలులో గడిపిన జగన్ చంద్రబాబుని 16 నిమిషాలైనా జైలులో పెట్టాలని కుట్ర పన్నారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఇరికించి అక్రమంగా అరెస్టు చేశారని, రాజకీయ కక్షతో ప్రతిపక్ష పార్టీలు, నాయకులను ఇబ్బంది పెట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుతో ఎంతో మంది నిరుద్యోగులు ఉద్యోగాలు పొందారన్నారు. చంద్రబాబు పారిపోయే వ్యక్తి కాదన్నారు. జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌లోనే 'కందికుంట' దీక్ష

కదిరి టౌన్ : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సామూహిక నిరాహార దీక్ష చేపట్టిన నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, పార్టీ శ్రేణులను అనుమతి లేదని, శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందంటూ పోలీసులు కందికుంటను బలవంతంగా పట్టణ స్టేషన్ తీసుకెళ్లారు. దీంతో కందికుంట స్టేషన్‌లోనే దీక్ష చేపట్టారు. స్టేషన్‌లోకి టిడిపి శ్రేణులు రాకుండా ఆ దారిలో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఇక చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ తనకల్లు మండలానికి చెందిన టిడిపి కార్యకర్త శివయ్య పట్టణంలోని వలిసాబ్ రోడ్డులో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని, లేదంటే ప్రాణత్యాగానికైనా సిద్ధమని హెచ్చరించడంతో పోలీసులు సర్దిచెప్పి దింపారు.

అత్తార్ చాంద్‌బాషా గృహ నిర్బంధం

మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో సామూహిక రిలే నిరాహార దీక్షకు పిలుపునిచ్చిన సమయంలో పోలీసులు అడ్డుకొని గృహ నిర్బంధం చేశారు. దీంతో చాంద్‌బాషా తన నివాసం ఆవరణలోనే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పుట్టపర్తి ఆర్‌డిఒ కార్యాలయం ముందు నిరసన

పుట్టపర్తి రూరల్ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలో భాగంగా పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం ముందు నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు సామ కోటి ఆదినారాయణ, సాలక్కగారి శ్రీనివాసులు, గూడూరు ఓబులేసు, మండల కన్వీనర్లు రామాంజనేయులు, విజయ్‌కుమార్, అంబు లెన్స్ రమేష్, మాల మనోహర్, శ్రీరామ్‌రెడ్డి, శ్రీరామ్‌నాయక్, పుల్లప్ప, బేకరీ గంగాధర్, జయప్రకాష్, నీళ్ల రమణ, తదితరులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ దీక్షలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అవినీతి మచ్చలేని చంద్రబాబుపై వైసిపి ప్రభుత్వం బురద జల్లాలని చూస్తుందన్నారు. చంద్రబాబును అరెస్టు చేయమని సిఎం జగన్ విదేశాలకు పారిపోయాడని, పరిపాలన చేతకాక ఇలాంటివి సృష్టిస్తున్నాడని మండిపడ్డారు. పుట్టపర్తి డిఎస్పీ వాసుదేవన్, పట్టణ సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో టిడిపి నాయకులను బలవంతంగా అరెస్టు చేసి బుక్కపట్నం స్టేషన్‌కు తరలించారు. అరెస్టులతో తమను ఆపలేరన్నారు.

విడుదల చేయాలి : గుండుమల తిప్పేస్వామి

మడకశిర : చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని బాలాజీ నగర్ పార్టీ కార్యాలయంలో చేపట్టిన సామూహిక నిరాహార దీక్ష కార్యక్ర మంలో గుండుమల మాట్లాడుతూ కడిగిన ఆణిముత్యంలా ఉన్న చంద్రబాబును అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. దీక్షలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి కెవిన్ పల్లి సురేష్, జిల్లా లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, జనసేన కన్వీనర్ శివాజీ, విశ్రాంత ఇంజినీర్ మల్లికార్జున, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, పట్టణ అధ్యక్షుడు మనోహర్, కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ ఉమాశంకర్, సర్పంచి నాగరాజు, తెలుగు యువత అధ్యక్షుడు తిమ్మరాజు, రవికుమార్, కొత్తపాలెం శీనప్ప, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన నాయకుల మద్దతు

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక దీక్షకు జనసేన పార్టీ నాయకులు మద్దతు పలికారు. టిడిపి ఆధ్వర్యంలో సామూహిక దీక్షకు పూనుకోగా పోలీసులు గుండుమల తిప్పేస్వామిని హౌస్ అరెస్ట్ చేశారు. అయితే టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లి బాలాజీనగర్ టిడిపి కార్యాలయంలో సామూహిక దీక్ష చేపట్టారు. వీరి దీక్షకు జనసేన పార్టీ మండల కన్వీనర్ శివాజీ, నాయకులు మద్దతు తెలిపారు.

రాక్షస పాలనకు నిదర్శనం : మాజీ ఎమ్మెల్యే ఈరన్న

మడకశిర రూరల్ : చంద్రబాబుకు లభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక సిఎం జగన్ అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయించడం రాక్షస పాలనకు నిదర్శనం అని మాజీ ఎమ్మెల్యే ఈరన్న పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఈరన్న తన అనుచరులతో కలిసి వేరుగా పార్టీ కార్యాలయంలో సామూహిక నిరహార దీక్ష చేపట్టారు. ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్ని డ్రామాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. దమ్ముంటే మీ బాబాయ్ వివేకా హత్య కేసు నిందితులను అరెస్టు చేయించాలని సవాల్ చేశారు. దీక్షలో రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ పాండురంగప్ప, ఆదినారాయణ, అశ్వత్థామప్ప, అధికార ప్రతినిధి జయరామిరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు రాజగోపాల్, రామాంజనేయులు, ఈశ్వరప్ప, కృష్టప్ప, అచ్చంపల్లి రమేష్, మూర్తినాయక్, ఈశ్వర్ సాగర్, పతికుంట నరేష్, గోవిందప్ప, కల్లుమర్రి ఎంపిటిసి నగేష్, గోపాల్‌రెడ్డి, శీన, రామన్న, రవి, తలారి వెంకటేష్, నారాయణప్ప పాల్గొన్నారు .

'పురంలో' ఎమ్మెల్యే నివాసం వద్ద దీక్ష

హిందూపురం : టిడిపి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరుతూ పట్టణంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేసి అక్కడే మౌన దీక్ష చేపట్టారు. అనుమతులు లేవని అడ్డుకోవడంతో టిడిపి శ్రేణులు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. చివరకు అరెస్టు చేయాల్సి ఉంటుందని హెచ్చరించడంతో వారు ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్దకు చేరుకుని దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక సిఎం జగన్ అక్రమ కేసులు పెట్టించి అరెస్టు చేయించి రాక్షసానందం పొందుతున్నాడని మండిపడ్డారు. దమ్ముంటే వివేకా హత్య కేసు నిందితులను అరెస్టు చేయాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, అంబికా లక్ష్మీనారాయణ, రమేష్‌కుమార్, రాఘవేంద్ర, ఆర్ఎంఎస్ షఫీవుల్లా, అంజనప్ప, రాము, దుర్గా నవీన్, జయసింహా, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల కేంద్రం బస్టాండ్ వద్ద చంద్రబాబు అరెస్టు చేయడంతో మండల కేంద్రంలో ఉండే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ఇదేమి రాజ్యం ధోపిడి రాజ్యం అంటూనిరసన వ్యక్తం చేశారు చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని. దీక్షలో అంజన్ననాయుడు, గంగులప్ప, ఆదినారాయణ, అజంతుల్లా, ఫయాజ్, చంద్రశేఖర్, గంగశేఖర్. గంగాధర్, వీరాంజనేయులు, రాహుల్, ఓబులేసు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : టిడిపి అధినేత చంద్రబాబుకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించడం, అరెస్ట్ నేపథ్యంలో టిడిపి కార్యకర్తలు, నాయకులు కదిరి-హిందూపురం ప్రధాన రహదారి పై టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేశారు. కందికుంట మాట్లాడుతూ చంద్రబాబుకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించిండంతో న్యాయవ్యవస్థ పై గౌరవం ఉందని నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటించాలని సూచించారు. ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు చేపట్టకుండా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



కదిరిలో కందికుంట, తదితరులు








పుట్టపర్తి ఆర్‌డిఒ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న తెలుగు తమ్ముళ్లు, పెనుకొండలో దీక్షలో మాట్లాడుతున్న సవితమ్మ, మడకశిర శిబిరంలో మాట్లాడుతున్న గుండుమల, మాజీ ఎమ్మెల్యే ఈరన్న, ఎన్‌పికుంటలో టైర్లు దహనం చేస్తున్న నాయకులు, కదిరిలో నిరాహార దీక్షలో పాల్గొన్న అత్తార్-చాంద్‌బాషా, నాయకులు, కార్యకర్తలు

ఐలమ్మకు నివాళి

ప్రజాశక్తి-కదిరి టౌన్

అగ్ని ఖని చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక రాయచోటి రోడ్డులోని విఠలరాయుని చెరువు దోబీఘాట్ వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ వీరనారి చాకలి ఐల మ్మ పేద రైతుల కోసం అగ్రవర్ణాలు, భూస్వాములు, రజాకార్లను ఎదిరించి భూ పోరాటం చేసిన గొప్ప నాయకురాలు అన్నారు. భూ పోరాటంలో విజయం సాధించి పేద వర్గాలకు లక్షలాది ఎకరాలు భూమిని పంచి పెట్టిన వీర వనిత అన్నారు. తన కుటుంబాన్ని పేద వర్గాలకు బలిదానం చేసి తన ఇంటినే పార్టీ కార్యాలయంగా మార్చిందన్నారు. ఆమె తెగువతో తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిందన్నారు. ఆమె కొనసాగించిన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని మనం కూడా ఉద్యమాన్ని కొనసాగించి రజకుల సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తెలికె ఆంజనేయులు, హరి, మంగళి మహాసభ జాతీయ కన్వీనర్, రజక సంఘం పట్టణ నాయకులు పి.నాగభూషణ, పి.నాగేంద్ర, గంగాధర్, వెంకటరమణ, రామాంజనేయులు, సుబ్బు, గంగులప్ప, మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

శాఖాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జయచంద్రారెడ్డి, బాబా కలందర్, సుభాషిణి పేర్కొన్నారు. శ్రీ సంబాల దివ్యశక్తి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ధ్యాన మందిరం నిర్వాహకుల ఆధ్వర్యంలో 'శాకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం' అనే అంశంపై చేపట్టిన ర్యాలీని పట్టణంలోని సైదాపురం ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభించి కాలేజీ సర్కిల్, జీమాను సర్కిల్ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పెనుకొండ నుంచి సత్యం శివం సుందరం స్వామీజీ, అనంతపురం నుండి రాజేష్ స్వామీజీ, నీరజ మేడం, వెంకటరమణారెడ్డిస్వామీజీ, సూర్యనారాయణస్వామీజీ హాజరయ్యారు. ర్యాలీలో పట్టణ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'108'లోనే ప్రసవం

ప్రజాశక్తి-హిందూపురం

పరిగి మండల పరిధిలోని బసనపల్లి సమీపంలో నివసించే మహారాష్ట్రానికి చెందిన నిండు గర్భిణి ప్రేమకు పురిటి నొప్పులు రాగా భర్త గణేష్ ఆదివారం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నామని మెరుగైన వైద్యం కోసం అనంతపురం వెళ్లాలని సూచించారు. చిలమత్తూరు 108 వాహనంలో అనంతపురం వెళ్తుండగా మార్గమధ్యలో పెనుగొండ సమీపంలో పురిటి నొప్పులు తీవ్రం కావడంతో వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి ఈఎంటి సురేష్ చాకచక్యంగా కాన్పు చేశారు. ప్రేమ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. ప్రేమ బంధువులు, భర్త 108 సిబ్బంది, ఈఎంటి సురేష్, పైలెట్ ఫరీద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం పెనుగొండ ఆసుపత్రికి తరలించారు.



పురిటి బిడ్డను చూపిస్తున్న 108 సిబ్బంది

'స్కిల్' కేసులో చంద్రబాబుకు శిక్ష తప్పదు

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణం కేసులో టిడిపి అధినేత చంద్రబాబుకు కఠిన శిక్ష తప్పదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేసు వివరాలను వెల్లడించారు. 2014లో చంద్రబాబు సన్నిహితుడు ఇల్లెందు రమేష్ జర్మనీ కంపెనీ అయిన సీమెన్స్ కంపెనీని పరిచయం చేసి నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును రూపకల్పన చేశారన్నారు. అంచనా వ్యయం రూ. 3.356కోట్లు కాగా ప్రభుత్వ వాటా 10శాతం, సీమెన్స్ కంపెనీ 90 శాతం నిధులు ఖర్చు పెట్టేలా ఒప్పందం కుదిరిందన్నారు. ఆ తర్వాత స్కిల్ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వ వాటాగా రూ. 330 కోట్లను 5 దశల్లో విడుదల చేశారన్నారు. అయితే సీమెన్స్ కంపెనీ చెల్లించాల్సిన 90శాతం వాటాలో పైసా కూడా విడుదల కాకపోగా ప్రభుత్వ వాటా నిధులను షెల్ కంపెనీ ద్వారా అక్రమ దారిలో చంద్రబాబుకు చేర్చారన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి కల్పనకు సంబంధించి ఒక అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఆ తర్వాత సీమెన్స్ కంపెనీ యాజమాన్యం ఈ తతంగాన్ని అంతా బట్టబయలు చేశారన్నారు. ఈ స్కాం నిధుల విడుదలలో అక్రమాలు జరిగాయని అప్పటి సిఎస్, మరో ఐఎఎస్ అధికారిణి చెప్పినా చంద్రబాబు నిధులు విడుదల చేయించారన్నారు. ఈ విషయం బయటకు పొక్కకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో చంద్రబాబుకు అనుకూలంగా ఉన్న అధికారులకు పోస్టింగ్ ఇచ్చారన్నారు. అందుకే అక్రమాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రజా క్షేత్రంలో, చట్ట పరిధిలో చంద్రబాబుకు కఠిన శిక్ష తప్పదని ఎమ్మెల్యే కేతిరెడ్డి పేర్కొన్నారు.

గాండ్లపెంటకు హంద్రీనీవా నీరు తెస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలో మరో మూడు నెలల్లో హంద్రీనీవా కాలువ తవ్వకం పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి తెలిపారు. నల్లచెరువు మండల పరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వంద ట్రాక్టర్లలో రైతులతో కలిసి ఆయన భారీ ర్యాలీగా సామసేను బైలు మీదుగా మల్లమీదపల్లి నుంచి గాండ్లపెంటకు చేరుకొని దివంగత సిఎం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దాదాపు 16 ఏళ్ల నుంచి కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్న మండలంలో తాగు, సాగునీటి కోసం ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. ఈ విషయాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి వెంటనే హంద్రీనీవా కాలవకు నిధులు మంజూరు చేశారని, 3 నెలల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కాలువ ద్వారా అన్ని చెరువులను నీటితో నింపు తామని తెలిపారు.



ట్రాక్టర్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి

కార్యక్రమంలో ఎంపిపి జగన్మోహన్, ఎన్‌పి కుంట ఎంపిపి రాము, వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్ అలీ, మాజీ జడ్పిటిసి భాస్కర్‌రెడ్డి, వైఎస్ ఎంపిపి భారతి, సర్పంచులు కళావతి, ఎస్.రహంతుల్లా, నాగభూషణంరెడ్డి, రవీంద్రనాయక్, మాజీ సర్పంచి కె.హుస్సేన్ పీరా, చలపతి, ప్రతాపరెడ్డి, జి.రవీంద్రారెడ్డి, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'అభివృద్ధి' పేరుతో ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి-హిందూపురం

అభివృద్ధి పనుల పేరుతో కొందరు వ్యక్తులు పట్టణ సమీపంలో ఉన్న పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పురపాలక సంఘంలో జరిగే అభివృద్ధి పనులకు ఇసుక అవసరం ఉంటే పక్కన ఉన్న రీచ్‌ల నుంచి క్యూబిక్ మీటర్ రూ. 600 చొప్పున గుత్తేదారులు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అందుకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుంది. అది సైతం మున్సిపల్ కమిషనర్ లేఖను అనుసరించి ఇసుక రీచ్ నుంచి తీసుకు రావాల్సి ఉంటుంది. అయితే ఇదేమీ పట్టని గుత్తేదారులు కమిషనర్ లేఖ ఇచ్చిన వెంటనే ఏకంగా పెన్నా నదిలో జెసిబి 6 ట్రాక్టర్లు ఏర్పాటు ఆర్‌టిసి కాలనీ, ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే మున్సిపల్ కమిషనర్ ఈ నెల 7వ తేదీ ఇసుక కోసం లేఖ ఇచ్చారు. ఆ లేఖను అందరికీ చూపిస్తూ నాలుగు రోజుల నుంచి ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఆదివారం సైతం ఆర్‌టిసి కాలనీలోని సెబ్ స్టేషన్ పక్కనే డంప్ చేస్తున్నా అధికారులెవరూ స్పందించక పోవడం విమర్శలకు తావిస్తోంది. దీంతో పాటు ఇసుక రవాణాకు మున్సిపల్ కమిషనర్ అనుమతి లేఖ ఇవ్వడం గమనార్హం.



ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తున్న దృశ్యం

పోలీసు కుటుంబానికి చేయూత

బత్తలపల్లి : స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఓబులేసు కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీంతో తోటి ఉద్యోగులు మానవతా దృక్పథంతో ఆదివారం రూరల్ సిఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి రూ. 77,100 అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ సోమశేఖర్, పోలీసులు నారాయణస్వామి, జనార్ధన, తదితరులు పాల్గొన్నారు.



హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పోలీసులు

నేడు అనంతలో 'శ్రీరామిరెడ్డి' కార్మికుల ధర్నా

గుడిబండ : శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్, సిఐటియు అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యల పై సోమవారం(నేడు) ఉదయం 10 గంటలకు అనంతపురం నగరంలోని కలెక్టరేట్ ముందు ధర్నా చేపడుతున్నట్లు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. ధర్నా అనంతరం కార్మికుల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామని మడకశిర, హిందూపురం డివిజన్ పరిధిలోని శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

'ఆశా'లకు కనీస వేతనం రూ. 26వేలివ్వాలి

ప్రజాశక్తి-హిందూపురం

ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని ఎఐటియుసి ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి నాగవేణి డిమాండ్ చేశారు. చౌళూరు పిహెచ్‌సిలో ఆదివారం జయమ్మ అధ్యక్షతన ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. నాగవేణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా వర్కర్లతో వెట్టి చాకిరీ చేయించుకుంటుందన్నారు. సుప్రీం కోర్టు తీర్పు మేరకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని, విశ్రాంతి పొందిన ఆశా వర్కర్లకు రూ. 5లక్షలు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, పెండింగ్‌లో ఉన్న లెప్రసీ, టిబి బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు వినోద్‌కుమార్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు భూమిక, ఎస్.పద్మావతి, శారద, అలివేలమ్మ, రాధ, లింగమ్మ, పద్మావతమ్మ, సరస్వతమ్మ, పాల్గొన్నారు.



నాసిరకంగా ఉన్న పంటను చూపుతున్న రైతు

నకిలీ విత్తనాలతో పంట నష్టం

ప్రజాశక్తి-రొద్దం

మండల పరిధిలోని గౌరాజుపల్లి గ్రామానికి చెందిన రైతు సుబ్బారాయప్ప మూడు నెలల క్రితం రొద్దం లోని ఓ దుకాణంలో సిపి-333 రకం మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేశాడు. దాదాపు 17 ప్యాకెట్లు ప్యాకెట్ రూ. 1400 చొప్పున కొనుగోలు చేసి తనకున్న 4 ఎకరాల పొలంలో పంట సాగు చేశాడు. అయితే విత్తనం వేసిన తరవాత సుడి రోగంతో పంట మధ్య దశలోనే ఎండుముఖం పట్టింది. మరో రైతు పొలంలో పంట ఏపుగా పెరగడంతో పాటు చేతికందే దశలో ఉంది. దీంతో సదరు రైతు తాను పూర్తిగా పంట నష్టపోయినట్లు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

రేషన్ బియ్యం స్వాధీనం

బెలుగుప్ప : అక్రమంగా తరలిస్తున్న 30 కింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యంతోపాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని శ్రీరంగాపురం సమీపంలో ఆదివారం ఉదయం వాహనాలను తనిఖీ చేస్తుండగా కలేకుర్తి నుంచి వాహనంలో 30 క్వింటాళ్ల ప్రభుత్వ రేషన్ బియ్యం కళ్యాణదుర్గానికి తరలిస్తుండగా శ్రీరంగపురం క్రాస్ సమీపంలో స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యంతోపాటు వాహనం, ముగ్గురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలిస్తామన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-హిందూపురం

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం(ఒపిఎస్)ను పునరుద్ధరించాలని ఎపిటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం నారాయణస్వామి అధ్యక్షతన సమావేవం నిర్వహిం చారు. సీనియర్ నాయకులు గురు రాజారావు మాట్లాడుతూ విద్యారంగం వ్యవస్థపై, ప్రభుత్వ టీచర్లపై ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. జిల్లా కార్యదర్శి అంజనమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఆర్‌సి కార్యాలయంలో ఉత్తమ ఉద్యోగులుగా ప్రశంసాపత్రాలు అందుకున్న వారిని ఉపాధ్యాయులు సన్మానించారు. అలాగే ఎన్నికల అధికారులు అంజనమూర్తి, రవిశేఖర్, రామదాస్‌నాయక్ ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవాధ్యక్షులుగా బి.వెంకటరమణప్ప, గౌరవ సలహాదారు లుగా మల్లికార్జునరెడ్డి, రంగమ్మ, అధ్యక్షులుగి కె.నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నారాయణస్వామి, జిల్లా కౌన్సిలర్లుగా సలీంబాషా, మోహన్‌కుమార్, ఆదినారాయణ, సుధాబాయి, ఆంజనేయులు, ఆదిలక్ష్మి, నారాయణస్వామి, ఉమామహేష్, ఉపాధ్యక్షులుగా బి.నాగమ ణి, ఎం.గంగాధర్, వెంకటేష్‌ప్రసాద్, ఆదినారాయణనాయక్, పరంధాములు, అనీస్‌అహమ్మద్, సహాయ కార్యదర్శులుగా లీలావతి, రవీం ద్ర, అన్నపూర్ణ, ముజహర్‌హుస్సేన్, రవికుమార్, గోపాల్, ఆడిట్ కన్వీనర్, ఇలియాజ్, సభ్యులుగా మరి కొంతమందిని ఎంపిక చేశారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ఊరేగింపు

ప్రజాశక్తి-కొత్తచెరువు

శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా హిందూ జ్ఞాన వేదిక ప్రబోదానంద సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద విద్యానికేతన్ ఆవరణలో కృష్ణుని విగ్రహం ఏర్పాటుచేసి ఐదు రోజులుగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం విగ్రహాన్ని పల్లకిలో ఉంచి వందలాది భక్తుల మధ్య గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. పాఠశాల నుంచి ప్రారంభమైన ఊరేగింపు బిసి కాలనీ, వడ్డెర కాలనీ, గాంధీనగర్, నెహ్రూనగర్, తదితర వీధుల గుండా ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు వివిధ రకాల వేషధారణలో పలు విన్యాసాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అలివేలమ్మ, నాగేంద్ర, పద్మావతి, కల్పన, శాంతి, రెడ్డప్ప, సాయినాథ, భక్తులు పాల్గొన్నారు.



గ్రామ వీధుల్లో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

తలుపుల : తలుపుల ప్రకాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న రమణయ్య మృతి చెందడంతో ఆదివారం వైసిపి సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి డికె బాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే అతడి కుటుంబానికి రూ. 10వేలు అందజేసి, పరామర్శించారు. ఆయనతో పాటు వెంకట్, ప్రభు, మౌలా, తదితరులు పాల్గొన్నారు.



మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న డికె బాబు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-గాండ్లపెంట

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించా రు. 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు పాఠశాల ఆవరణలో అప్పటి గురువులు లక్ష్మినరసయ్య, లింగాల రవీంద్రారెడ్డి, పామిడి ముంతాజ్, ఇబ్రహీం, ఖలీల్, ఎస్.ఫయాజ్, జగన్మోహన్‌రెడ్డి, విశ్వనాథ్‌లను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఒకరి నొకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముజాహిద్, చౌడయ్య, రామంజనేయులు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



అప్పటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కలెక్టరేట్ : సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంటాక్టు, ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష, కేజీబీవీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, పార్ట్ టైమ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం ఆదివారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరసన దీక్షకు యుటిఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వేతనాలు పెంచి 15 నెలలు గడుస్తున్నా పెంచిన వేతనాలు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. సమాన పనికి సమాన వేతనం, విద్యాశాఖలో పని చేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌వి.రమణయ్య, సత్యసాయి జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న తదితరులు పాల్గొన్నారు.